జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం | 1 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 7

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ అప్రజాస్వామికం



6 లో...




2 లో..

# ప్రజాసేవే పరమావధిగా సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- అభివృద్ధిలో ఆదర్శంగా ఖమ్మం జిల్లా
- స్థానిక కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా దంసలాపురం రోడ్డు వరకు బీటీ రోడ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంకు స్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరావు

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

## మధిర నియోజకవర్గ వ్యాప్తంగా సెప్టెంబర్ 2 నుండి నిరసనలు హోరెత్తాలి




3 లో...

## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో మిగతా 2 లో...




# ప్రజాసేవే పరమావధిగా సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**అభివృద్ధిలో ఆదర్శంగా ఖమ్మం జిల్లా**

**స్థానిక కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా దంసలాపురం రోడ్డు వరకు బీటీ రోడ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరావు**

## రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక ప్రకాశ్ నగర్ లో కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా ఎస్ వి ఎం స్కూల్, దంసలా పురం రోడ్డు వరకు రూ. 12 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ,తనకు ప్రజా శ్రేయస్సే ముఖ్యమని, తాను ఎప్పుడూ పదవులను ఆశించలేదని,కేవలం ప్రజల ఆకాంక్షలు,ఒత్తిడి మేరకే రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు.స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు.ఖమ్మం ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన ఆదరణకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, అభివృద్ధి రూపంలో ఆ రుణం తీర్చుకుంటానని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గానికి అవసరమైన విద్యా, వైద్య, రహదారుల నిర్మాణంతో పాటు మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.నియోజకవర్గ ప్రజలు కోరిన,తన దృష్టికి వచ్చిన ప్రతీ



సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. రాజకీయ వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అందరి సహకారంతో ఖమ్మం రూపురేఖలు మారుస్తామని మంత్రి అన్నారు.ఖమ్మం పట్టణాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే తమ ఏకైక కోరిక అని, నియోజకవర్గంలో రవాణా,తాగునీరు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం ఖమ్మమేనని తెలిపారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందేలా మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రజలందరూ అంగీకరిస్తే 100 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా రోడ్ల వెడల్పు, అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి అన్నారు.ఖమ్మం పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రూ. 250 కోట్లు మంజూరు చేశారన్నారు. పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, 24 గంటల పాటు మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలో దౌర్జన్యాలు, కబ్జాలు, అక్రమ కేసులకు తావులేకుండా శాంతిభద్రతలను కాపాడాలన్నారు. తప్పు చేసిన వారికి కఠిన శిక్ష పడాలని, అయితే ఎలాంటి తప్పు చేయని అమాయకులు, పేద ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు వంటి అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుందని, వాటిని సక్రమంగా నిర్వహించి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఖమ్మం ప్రజలపైనే ఉందని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు,ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్,ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి...)

కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు .భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు జిల్లాలో ఉన్న విద్య, వైద్య,ఇతర అంశాలను సూచిస్తూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, జిల్లా పరిధిలో సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు.కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామ పంచాయతీకి చెందిన సంతోష్ లకావత్ గ్రామంలో ప్రత్యేక అధికారి పాలన కాలంలో సుమారు 9 లక్షల రూపాయల వరకు జరిగిన బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ, ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిప్యూటీ సీఈఓ ఖమ్మంకు రాస్తూ సెప్టెంబర్ 9 నాటికి విచారణ జరిపి రిపోర్టు సమర్పించాల్సిందిగా అదనపు కలెక్టర్ ఆదేశించారు.కల్లూరు మండలం తాళ్లూరి వెంకటాపురం గ్రామానికి చెందిన పాశం నాగేశ్వర



రావు తన కుమార్తె పాశం ప్రియమణిని లంకపల్లి బిసి గురుకులం నుంచి రెబ్బవరం బీసీ గురుకులం పాఠశాలకు మార్చాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బిసి సంక్షేమ అధికారికి రాస్తూ చర్యలు తీసుకోవాలని అ న్నారు. తిరుమ లాయ పాలెం మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన జోగుపర్తి బుచ్చమ్మ తన భర్త మరణించిన తర్వాత తనకు తెలియకుండా భర్త పేరు మీద ఉన్న ఆరు ఎకరాల 30 గుంటల భూమి తన కుమారుడు, కోడలు వారి పేరు మీద పాస్ పుస్తకం చేయించుకున్నారని, ఇప్పుడు తన సంరక్షణకు కూడా ఎటువంటి సహాయం చేయడం లేదని తన పోషణ పరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# మధిర నియోజకవర్గ వ్యాప్తంగా సెప్టెంబర్ 2 నుండి నిరసనలు హోరెత్తాలి





- ఎర్రుపాలెంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించిన మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్ రాజు.
- కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను ఎండగడుతూ బీఆర్ఎస్ నిరసనలు.
- 420 హామీల అమలులో వైఫల్యం.. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు ఆందోళనలు: లింగాల కమల్‌రాజు

**ఎర్రుపాలెం ప్రజాజ్యోతి** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజా సమస్యలను గాలికొది లేసిందని బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని కమల్‌రాజు ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కూడా అమలు చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. 100 రోజుల్లో నెరవేరుస్తామని చెప్పిన ఈ ప్రభుత్వం 1000 రోజులైనా నేరవార్చలేదన్నారు.రైతు బందును బందు చేశారన్నారు. రైతు చనిపోతే కుటుంబానికి భీమా కల్పించిన ఘనత కెసిఆర్ దే అన్నారు. అలాంటి రైతు భీమా ప్రీమియం పూర్తిగా నిలిపివేసి రైతు కుటుంబాల ఉసురు పోసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి ఓట్లసిన ప్రజలకు కొండ నాలుకకు మందు వేస్తె ఉన్న నాలుక ఊడి పోయినట్టు అయిందన్నారు. నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు.బిఆర్ఎస్ చేసిన అభివృద్ధిని స్థానిక ఎమ్మెల్యే తానే చేస్తున్నానని చెప్పుకోవటం సిగ్గు చేటన్నారు.జిల్లాలో కెసిఆర్ మొదలు పెట్టిన సాగు నీటి ప్రాజెక్ట్ లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందన్నారు.అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజల వద్ద దరఖాస్తులు తీసుకోవటమే తప్ప అమలు చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఎర్రుపాలెం మండలంలో కూడా ఈ కార్యక్రమాలను మండల స్థాయిలో విస్తృతంగా నిర్వహించి విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని కమల్‌రాజు తెలిపారు.పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి,సర్పంచ్ లు శీలం రామకోటారెడ్డి, వేల్పుల బెంజిమెన్, కొల్లు శ్రీనివాసరావు,మండల నాయకులు గూడూరు రమణారెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కుడుముల మల్లికార్జున రెడ్డి, బొర్ర నరసింహారావు, యరమల కృష్ణారెడ్డి, కోట శ్రీనివాసరావు, సంక్రాంతి కృష్ణారావు, బాలరాఘవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, తిరుపతిరావు, నాగేశ్వరరావు,కాళేశ్వరావు, వెంకటనారాయణ,రవి, పూర్ణారెడ్డి, పుల్లారెడ్డి, వెంకయ్య, వెంకటేశ్వరావు, వెంకట్,యువజన, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నార్కోటిక్ డాగ్‌తో విస్తృత తనిఖీలు

- గంజాయి వినియోగ ప్రదేశాలపై పోలీసుల నిఘా






**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, ఆగస్టు 31 :** మాదకద్రవ్యాల వినియోగం, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తిరుమలాయపాలెం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్సై కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో నార్కోటిక్ డాగ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.సుబ్లేడ్ గ్రామంలోని గ్రానైట్ క్వారీ, గడీ వెనుక బజారు ప్రాంతం, కొంతమంది అనుమానితుల ఇళ్ల పరిసరాల్లో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. అనంతరం కాకరవాయి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పరిసరాలు, కనకదుర్గమ్మ ఆలయ ప్రాంతం, మద్దెల చెరువు ప్రాంతాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. అలాగే ముజాహిద్‌పురం, పిండిప్రోలు గ్రామంలోని పలుచోట్ల గంజాయి వినియోగం జరుగుతుందనే అనుమానాలున్న ప్రాంతాలను గుర్తించి నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు.మండలంలోని నిర్మానుష్య ప్రాంతాలు, యువత ఎక్కువగా సంచరించే ప్రదేశాలు, గంజాయి వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతినకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది.గంజాయి విక్రయాలు, వినియోగం లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. మండలంలో మాదకద్రవ్యాల నియంత్రణకు మరింత కఠినంగా చర్యలు చేపట్టనున్నట్లు ఎస్సై కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలోని పోలీసులు స్పష్టం చేశారు.

# గౌడ సంక్షేమ భవన్ నిర్మాణానికి భూమి పూజ చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల





**రఘునాథపాలెం ప్రజాజ్యోతి** రఘునాథపాలెం సబ్ స్టేషన్ ఎదురుగా ఖమ్మం గౌడ సంఘానికి తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 30 గుంటల స్థలంలో 5 కోట్ల రూపాయలతో నిర్మించబోతున్న గౌడ సంక్షేమ భవన్ (కమ్యూనిటీ హాల్ ) నిర్మాణానికి తుమ్మల నాగేశ్వరరావు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. భూమి పూజ కార్యక్రమంలో మాజీ మ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్, హస్తకళలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, వేర్హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, స్థంబాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ వాళ్ళ దుర్గాప్రసాద్ గారు,జిల్లా గ్రాందాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా,మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు గౌడ్,డీసీసీ ఖమ్మం నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి,ఖమ్మం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు గౌడ్, ప్రధాన కార్యదర్శి బొలగాని, శ్రీనివాసరావు గౌడ్, తెలంగాణ గౌడ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, ప్రధాన కార్యదర్శి మార్కం లింగయ్య గౌడ్ , మోకు దెబ్బ బండి నాగేశ్వర రావు గౌడ్ బిచ్చల తిరుమలరావు గౌడ్, బోయినపల్లి లక్ష్మణ్ గౌడ్, ఊడుగు రమేష్ గౌడ్ , రడం సురేష్ గౌడ్ సంపేట ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ హియరింగ్ కు పోటెత్తిన ఓటర్లు



**నేలకొండపల్లి, ఆగస్టు 31, ప్రజాజ్యోతి :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సర్ కింద నోటీసులు అందుకున్న వారంతా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలకు వరస కడుతున్నారు. తొలుత మ్యాఫింగ్ కాని ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు కార్డులను తీసుకరమ్మని సూచించటంతో ఆధారాలతో హియరింగ్ కు హజరవుతున్నారు. మండలం లోని సోమవారం ఆచార్లగూడెం, కట్టుకాచారం, మంగాపురంతండా, శంకరగిరితండా గ్రామాలలో హియరింగ్ నిర్వహించారు. మంగాపురంతండా లో 86 మంది కి నోటీసులు ఇవ్వటంతో అంతా హజరయ్యారు. వీరి కోసం కుటుంబ సభ్యులు కూడ రావటంతో జనసందడిగా మారింది. సర్పంచ్ ధీరావత్ ఆశోక్రాణి, మత్స్య సోసైటీ ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి తదితరులు హజరూయ్యారు. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. నోటీసులకు అవసరమైన ఆధార పత్రాలను బీఎల్వేలు, సహాయ ఎన్నికల అధికారుల సమక్షంలో ఓటర్ల ఫోటోలను వారిచ్చిన పత్రాలను మొబైల్ లోని ప్రత్యేక యాఫ్ లో పొందుపరుస్తున్నారు. నాలుగు రకాల ఆధారాలు తీసుకురావాలని చెప్పటంతో వాటిలో ఆయా కేంద్రాలకు ఓటర్ల తమ కుటుంబ సభ్యులతో తరలివస్తున్నారు. దీంతో ఆయా కేంద్రాల వద్ద సందడిగా మారింది. శంకరగిరితండా లో ఎంపీడీఓ యం.యర్రయ్య, మంగాపురంతండా లో డిప్యూటీ తహశీల్దార్ కె.నరసింహారావు, ఆచార్లగూడెం లో యంపీవో శ్రీనివాసరావు, కట్టుకాచారం లో యంఈవో చలపతిరావు లు హియరింగ్ కు హజరై పత్రాలను స్వీకరించారు.

# రేషన్ దుకాణం ను వెంటనే ఏర్పాటు చేయాలి

- కోటేశ్వరరావు దంపతులు ప్రజావాణి లో ఫిర్యాదు



**నేలకొండపల్లి, ఆగస్టు 31 ప్రజాజ్యోతి :** మండలం లోని చిన్నతండా లో వెంటనే ప్రభుత్వ చౌక దుకాణంను వెంటనే ఏర్పాటు చేయాలని ధీరావత్ కోటేశ్వరరావు -పుష్పావతి దంపతులు వినతి పత్రం ను అందించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజావాణి లో వినతి పత్రం ను అందించి, అక్కడి గిరిజనులు పడుతున్న ఇబ్బందుల గురించి అధికారులకు వివరించారు. మంగాపురంతండా లో ఉన్న చౌకదుకాణం వద్ద కు వెళ్లి బియ్యం తీసుకోవటానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదావు కిలో మీటరు కు పైగా నడిచి వెళ్లి తీసుకోవాల్సి వస్తుందని.. దీని వలన ప్రజలకు అవస్థలు పడుతున్నారని A వాపోయారు. ఈ విషయం పై గతంలో జిల్లా సివిల్ సప్లై అధికారులకు, రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని అగ్రహాం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే చిన్నతండా లో ప్రభుత్వ రేషన్ దుకాణం ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. చెరువుమాధారం చెరువులో విషపూరిత మందు కలిపిన వారి పై చర్యలు తీసుకోవాలని సోసైటీ మాజీ చైర్మన్ ఈవూరి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. మండలం లోని వివిధ సమస్యల పై ప్రజావాణి లో బాధితులు ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య. ఎస్సై శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుదాసు మాస్టారు పదవి విరమణ

- పుట్టిన ఊరి పాఠశాలలో సేవలందించిన ప్రధానోపాధ్యాయుడికి ఘన వీడ్కోలు
- పదవీ విరమణ సమయానికి అనారోగ్యానికి గురికావడం బాధాకరం: ఎం.ఈ.ఓ నక్క రాజేశ్వరరావు



**స త్తుప ల్లిఆ గ స్టు3 1 ( ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో ఎం.పీ.పీ.ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ తన సొంత గ్రామంలో పేద విద్యార్థుల అభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు అందించిన కొండా ప్రభుదాసు సోమవారం పదవీ విరమణ చేశారు. చదువుకునే విషయంలో పాఠశాల విద్యార్థులు అసౌకర్యానికి గురైన ప్రతిసారీ సమస్యను తన సొంత ఖర్చులతోనైనా పరిష్కరించే గుణం ఆయన సొంతం అని సహచర ఉపాధ్యాయులు కొనియాడారు. తన వద్ద చదువుకున్న ప్రతి విద్యార్థి జీవితంలో ప్రయోజకుడిగా ఎదగాలనే దృఢ సంకల్పంతో ప్రభుదాసు విధుల పట్ల అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

**» అనారోగ్యానికి గురికావడం బాధాకరం**

నాణ్యమైన విద్యను పిల్లలకు అందించడం, పాఠశాలలో మౌలిక సదుపాయాలను సొంత ఖర్చులతో మెరుగుపరచడంలో తమదైన ముద్రను ప్రభుదాస్ ఏర్పరచుకున్నారని ఎం.ఈ.ఓ కొనియాడారు. తమ సేవను గుర్తించి జిల్లా కలెక్టర్ ప్రభుదాస్ ను ఉత్తమ ఉపాధ్యాయునిగా సన్మానించిన తీరును ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనివార్య కారణంతో ప్రధానోపాధ్యాయుడు కొండా ప్రభుదాస్ పదవీ విరమణ సమయానికి అనారోగ్యానికి గురికావడం బాధాకరమని ఎం.ఈ.ఓ నక్క రాజేశ్వరరావు అన్నారు. విద్యార్థుల పట్ల ప్రేమ, వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ప్రభుదాసు చూపిన నిబద్ధత ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. పదవీ విరమణ సందర్భంగా విద్యాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, కుమార్తె హారిక(స్వీటీ), కుటుంబ సభ్యుల సమక్షంలో కొండా ప్రభుదాసు, నాగరత్నం దంపతులను ఘనంగా సన్మానించారు. శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ప్రభుదాస్ మాస్టారు తమ పాఠశాలకు, విద్యార్థులకు అందించిన సేవలను తల్లిదండ్రులు గుర్తు చేసుకున్నారు. ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమేనని మాస్టారు భావి జీవితం సుఖసంతోషాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో సాగాలని ఆకాంక్షిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు, కాంగ్రెస్ నాయకుళ్ళ అప్పారావు, విద్య అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి నా లక్ష్యం

- జిపి నిధుల నుంచి ఫ్రీజర్ కొనుగోలు.. సర్పంచ్ హీరాలాల్



**కారేపల్లి, ఆగస్టు 31, ప్రజాజ్యోతి:** గ్రామ అభివృద్ధి నా ప్రధాన లక్ష్యమని భాగ్యనగర్ తండా సర్పంచ్ భానోత్ హీరాలాల్ అన్నారు. సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండా సర్పంచ్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ సహాయ సహకారాలతో గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడపడమే నా ముఖ్య లక్ష్యం అన్నారు. గ్రామపంచాయతీలో సుమారు 5 వేల జనాభా గలరు. మరణించిన వారికి ఫ్రీజర్ లేక ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ సమస్యను గమనించి గ్రామపంచాయతీ నిధుల నుంచి ఫ్రీజర్ కొనుగోలు చేశాం,గ్రామంలో అంతర్గత రోడ్లు కొన్ని వర్షం వల్ల బుధమయమైనాయి అట్టి రోడ్లను గ్రావెల్ పోసి మరమ్మతులు చేయించాము. నీటి ఎద్దడి నివారణ కొరకు 30 చేతిపంపులు రిపేరు చేయించాము, డిబి సెంటర్లో కొత్త చేతిపంపు వేయించి ఆ సెంటర్లో నీటి నివారణ చేపట్టాము. గ్రామంలో అవసరమేరకు కొత్త పైప్ లైన్లు వేసి ఇంటింటికి నీటి సరఫరాను ఏర్పాటు చేశాము, గ్రామంలో డైలీ తడి పొడి చెత్త బండిని తిప్పుచున్నాము దీనితో గ్రామములో ప్రతి ఇల్లు శుభ్రంగా ఉంచుటకు ప్రయత్నం చేస్తున్నాము. నర్సరీలలో 8 వేలమొక్కల పెంపకం చేసాము. అందులో జామా, నిమ్మ పండ్ల మొక్కలను పెంచాము. పేదలు ఎవరైనా మరణించినసో వారి కుటుంబ సభ్యులకు నేను స్వతగా 5000 రూపాయలు ఆర్థిక సాయం చేస్తున్నాను, పేద కుటుంబంలో ఆడబిడ్డ జన్మిస్తే ఆ బిడ్డ పేరున 5000 రూపాయలు పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేస్తున్నాను. దోమల నివారణ కొరకు గ్రామంలో పాగింగు చేస్తున్నాము. పిచ్చి మొక్కల నివారణ కొరకు గడ్డి మందు పిచికారి చేసి మొక్కల నివారణ చేపట్టాము. గ్రామంలో వీధి దీపాలను నిత్యం ఏర్పాటు చేస్తున్నాము, సర్ ప్రోగ్రామ్ ని ప్రతిరోజు పరిశీల చేసి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తూ అనర్హులను తొలగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పి. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి పట్ల అంకిత భావం నిబద్ధత కలిగిన మంచి ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

- పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు



**మధిర ప్రజా జ్యోతి** మండలపరిధిలోని మాటూరు జడ్.పి.హెచ్.ఎస్ లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణచేసిన భాగ్య శ్రీనివాసరావును మధిర పి ఆర్టియు మండల శాఖ ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పి ఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు మాట్లాడుతూ గత 37 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దన శ్రీనివాస రావు మంచి చిత్రకారుడిగా జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా తాను పనిచేసిన గ్రామాల్లోని తల్లిదండ్రులు గ్రామ పెద్దలు మన్ననలు పొందారని ఆయన పేర్కొన్నారు.వృత్తి పట్ల అంకితభావం నిబద్ధత తో పనిచేస్తూ మంచి ఉపాధ్యాయుడుగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పిఆర్టియు జిల్లా శాఖ మధిర మండల శాఖల పక్షాన ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని వారి బావి జీవితం సుఖసంతోషాలతో ఆనందంగా గడవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి ఉపాధ్యక్షులు రవికుమార్ మధిర మండల ప్రధాన కార్యదర్శి పోలె సుధాకర్, మాజీ రాష్ట బాధ్యులు షేక్ మదార్ సీనియర్ నాయకులు బూసా కోటేశ్వరరావు కొలగాని ప్రసాదరావు పురం సంగారావు సాయి కృష్ణమాచార్యులు, వేము రాములు, ప్రసాదరావు, సత్యావతి, ప్రసూనా, సునీత నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు

## దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపాలి




**నేలకొండపల్లి, ఆగస్టు 31 ప్రజా జ్యోతి:** దివ్యాంగులలో ఆత్మస్థైర్యం ను నింపాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ,చలపతిరావు సూచించారు. మండల స్థాయి దివ్యాంగుల పోటీలను సోమవారం రాజేశ్వరపురం పాఠశాల లో ప్రారంభించారు. దివ్యాంగ బాల, బాలికలు వివిధ పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరిచారు. రన్నింగ్, మ్యూజికల్ చైర్, త్రోలింగ్ బాల్స్, క్యారమ్స్, చెస్ తదతర క్రీడలను నిర్వహించారు. మండలం లోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 35 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ఈ పోటీలు దివ్యాంగులలో ఆత్మ విశ్వాసం కలుగుతుందన్నారు. వారి మధ్య మరింత స్నేహ భావం కలిగి ఉండాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక .సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన వారిని సన్మానించిన కళాశాల బృందం

- ప్రిన్సిపాల్ ఎన్. విజయ కుమారి



**కారేపల్లి, ఆగస్టు 31, ప్రజాజ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి జూనియర్ కాలేజ్ లైబ్రేరియన్ గా సుదీర్ఘకాలం సేవలందించి సోమవారం పదవి విరమణ చేసిన సందర్భంగా కొండపల్లి శేషు ప్రసాద్ ని, అదేవిధంగా ఎం పి హెచ్ డబ్ల్యు కాంట్రాక్టు లెక్చరగా పనిచేసేన మీగడ కవిత ఈఎస్ఐ డిస్పెన్సరీ లో నర్సింగ్ ఆఫీసర్గా ఎంపికైన సందర్భంగా వారిరువురిని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ విజయకుమార్ ఆధ్వర్యంలో కళాశాల బృందం ఘనంగా సన్మానించి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన వెంటనే పూర్తి చేస్తాం

- ఎంపీడీవో బి పద్మ




**కారేపల్లి, ఆగస్టు 31, ప్రజా జ్యోతి:** ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును వెంటనే పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తామని సింగరేణి ఎంపీడీవో బి. పద్మ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల ప్రజలు వివిధ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. అట్టి దరఖాస్తులపై ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి దరఖాస్తు పరిష్కారం కొరకు ఆ శాఖల అధికారులకు దరఖాస్తులను పంపించాము, దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలను త్వరగా పరిష్కారమయ్యే విధంగా ప్రయత్నం చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రజలు గ్రామస్థాయిలో పరిష్కారం కానీ సమస్యను మాత్రమే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలి, గ్రామస్థాయిలో పరిష్కారమయ్యే ప్రతి చిన్న విషయానికి మండల కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవడం వలన ప్రయోజనం లేదు. ఈ విషయాన్ని మండల ప్రజలు గమనించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విముక్తి జాతుల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి






- సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి గ్రేసమ్మ
- విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి,సామాజిక భద్రతలో సమాన అవకాశాలు కల్పించాలి
- విముక్తి జాతుల హక్కులను పరిరక్షిస్తూ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి
- యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించి స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించాలి

- ఖమ్మంలో ఘనంగా విముక్తి జాతుల దినోత్సవ కార్యక్రమం

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** వివక్షకు గురైన విముక్తి జాతుల అభివృద్ధికి ప్రభుత్వం, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి ఐ. గ్రేసమ్మ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో విముక్తి జాతుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ చారిత్రకంగా వివక్షకు గురైన విముక్తి జాతుల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు సమాజం కూడా తన వంతు బాధ్యతగా సహకరించాలని అన్నారు.విముక్తి జాతుల విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రత వంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.విముక్తి జాతుల హక్కులను పరిరక్షిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా యువతకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం ద్వారా వారు స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.యువతలో విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన పెంచి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేసినప్పుడే విముక్తి జాతులు, సంచార, అర్ధ సంచార వర్గాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వల్లపు సోమరాజు, డాక్టర్ కె.వి.కృష్ణారావు, దేరంగుల బ్రహ్మం, పొదిలి నరసింహ రావు, షేక్ మస్తాన్, పఠాన్ బడే ఖాన్, బత్తుల గోపాల్, ఒర్సు కృష్ణా, మల్లా రు కృష్ణయ్య, బాలేఘాట్ నరసింహ రావు, సిహెచ్ వెంకన్న, షేక్ ఉస్మాన్, ఎస్కే మస్తాన్, బి .నాగేశ్వరరావు, జి రాము, వి.ఉపేందర్, ఎస్కే షకీలా, చెల్లా మల్లాద్రి, బత్తుల నాగరాజు, కే సురేష్, వేముల వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరుకు ఢిల్లీ బాట



**నేలకొండపల్లి, ఆగస్టు 31 ప్రజాజ్యోతి :** సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు నేలకొండపల్లి మండల సీపీఐ నాయకులు సోమవారం ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే చలో ఢిల్లీ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలపై సీపీ ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సీపీఐ కౌన్సిల్ సభ్యులు మారిశెట్టి విజయ, బాలిన కృష్ణంరాజు, భద్రజీ వేంకటేశ్వరరావు, కుంచం బిక్షం పాల్గొన్నారు.

## దశదినకర్మకు హాజరై నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మధిర ప్రజాజ్యోతి** మధిర మున్సిపాలిటీ పరిధి జిలగుమాడు లో దోర్నాల పెద్ద వెంకటేశ్వర్లు దశదినకర్మ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై, వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోర్నాల నాగమురళి, వంగవీడు గ్రామ సర్పంచ్ సిద్దిపోగు ప్రసాద్, ప్రముఖ విలేకరి తోటపల్లి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దోర్నాల సంతోష్ కుమార్, దోర్నాల వెంకట రవి, దోర్నాల కోటేశ్వరావు, దోర్నాల కొండలరావు, దొండపాటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## చెక్కు బౌన్స్ కేసులో నిందితులకు ఏడాది జైలు శిక్ష ఖరారు



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ఖమ్మం జిల్లా కోర్టు తీర్పు ఖమ్మం లీగల్ కుటుంబ అవసరాల నిమిత్తం తీసుకున్న అప్పుకు సంబంధించిన చెక్కు బౌన్స్ అయిన కేసులో నిందితులకు విధించిన శిక్షను ఖమ్మం జిల్లా కోర్టు స్థిరీకరించింది. కేసు వివరాల్లోకి వెళితే ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ 10వ డివిజన్‌కు చెందిన కొప్పుల నరసింహారావు, కొప్పుల సుభద్ర దంపతులు తమ కుటుంబ అవసరాల కోసం ఫిర్యాదుదారుడైన దురిశెట్టి వెంకన్న తండ్రి రాములు వద్ద నుండి రూ.22,00,000 (ఇరవై రెండు లక్షల రూపాయలు) అప్పుగా తీసుకున్నారు.ఆ మొత్తానికి బదులుగా వారు జారీ చేసిన చెక్కు బ్యాంకులో చెల్లకపోవడంతో దురిశెట్టి వెంకన్న కోర్టును ఆశ్రయించారు.దీనిపై విచారణ జరిపిన దిగువ కోర్టు (S.T.C.No.76/2024), నిందితులకు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు,రూ. 22,00,000 పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది.ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు ఖమ్మం జిల్లా కోర్టులో అప్పీల్ (Crl.A.No. 15/2026) దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన గౌరవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వాసుకుల సీనయ్య సోమవారం నిందితుల అప్పీల్‌ను కొట్టివేశారు. దిగువ కోర్టు విధించిన ఒక సంవత్సరం జైలు శిక్ష మరియు రూ. 22 లక్షల పరిహారాన్ని యథాతథంగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకవేళ నిందితులు ఆ పరిహార మొత్తాన్ని చెల్లించని పక్షంలో, అదనంగా మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు.

## నిజాయితీ చాటుకున్న మధిర డిపో ఆర్టీసీ సిబ్బంది శ్రీకాంత్ సైదులు



**మధిర, ప్రజాజ్యోతి:** మధిర డిపో చెందిన TS04UE1394 బస్ మధిర నుండి హైదరాబాద్ కు వెళ్తున్న బస్ లో ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఇనుపనూరి మధు ఖమ్మం నుండి ఎల్ బి నగర్ కు ప్రయాణం చేసి తను కూర్చున్న సీట్ లో మొబైల్ ఫోన్ మర్చిపోయి ఎల్ బి నగర్ వద్దు దిగి వెళ్ళారు. బస్ యంజిబిఎస్ బస్టాండ్ కు చేరిన తర్వాత బస్సు లో మొబైల్స్ పడి ఉండడం గమనించిన కండక్టర్ షేక్.నాగుల్ మీరా డ్రైవర్ వేల్పుల శ్రీకాంత్ మొబైల్ లోని నంబర్స్ ద్వారా సదరు ప్రయాణికుడికి సమాచారం ఇచ్చి నారు. హైదరాబాద్ బస్ స్టేషన్ మేనేజర్ (ఎస్ యం) సమక్షంలో లో 25,000/- విలువ గల పోకో మొబైల్ ఫోన్ ను సదరు ప్రయాణికుడికి అప్పగించడం జరిగింది. పోయిన తన మొబైల్ ఫోన్ ను తిరిగి అందజేసినందుకు కండక్టర్, డ్రైవర్ వేల్పుల శ్రీకాంత్ కి మరియు డిపో మేనేజర్ టి .దేవరాజుకి, మధిర డిపో సిబ్బంది కి ప్రయాణికుడు కృతజ్ఞతలు తెలియజేసాడు.

## చెరువులో క్రిమిసంహారక మందు పై విచారణ



**నేలకొండపల్లి, ఆగస్టు 31 ప్రజాజ్యోతి :** మండలం లోని చెరువు మాధారం చెరువు లో క్రిమిసంహారక మందు చల్లిన ఘటన పై అధికార యంత్రాంగం విచారణ చేపట్టింది. చెరువులో క్రిమిసంహారక మందు చల్లిన విషయం పై స్పందించిన అధికార యంత్రాంగం విచారణ కు ఆదేశించారు. ఇరిగేషన్ డీఈఈ పొట్టయ్య, మత్స్య శాఖ ఏడీ మల్లేశం, రెవిన్యూ శాఖ నుంచి తహశీల్దార్ రాంప్రసాద్, ఎస్సై పి.శ్రీనివాసరెడ్డి లు ఆయా శాఖల వారీగా క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. చెరువులో చల్లిన మందు ఏమిటీ...ఎందుకు చల్లారు.. ఎవరూ చల్లమన్నారు... తదితర విషయాల పై క్షేత్ర స్థాయి లో వివరాలు అడిగి తెలుసున్నారు. మత్స్యపారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం ను కూడ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఈ విషయం పై సొసైటీ మాజీ అధ్యక్షుడు ఈవూరి శ్రీనివాసరెడ్డి మరో మారు ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయటంతో పాటు, నేలకొండపల్లి యంపీడీఓ కు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## బీఎల్ఓకు టీఎస్‌జేఏసీ చైర్మన్ సన్మానం




**తిరుమలాయపాలెం, ప్రజాజ్యోతి, ఆగస్టు 31:** జల్లేపల్లి పీఎస్-20 బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 592 ఓట్లకు గాను 586 ఓట్లను విజయవంతంగా మ్యాపింగ్ చేసి మండలంలోనే టాప్‌గా నిలిచిన బీఎల్ఓ గాదరి మలుసూరమ్మను టీఎస్‌జేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ సోమవారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్-మ్యాపింగ్ ఓటర్లు ఎన్నికల అధికారులు సూచించిన ధ్రువపత్రాలను సమర్పించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు నిర్ణీత తేదీన అధికారుల ఎదుట హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌జేఏసీ సభ్యుడు బాజ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, బీఎల్ఓ ఇర్రి పద్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డ్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో బాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. వి. సుధాకర్ రెడ్డి ఎస్సై,కె. రాయప్ప ఎస్సై,వి. రామారావు ఎస్సై,ఎం. శ్రీనివాసరావు ఏఎస్ఐ,ఎండీ. అబ్దుల్ రహెమాన్ ఏ ఎస్ ఐ ఎస్.కె. అహ్మద్ హెచ్ సి కె. సత్యం హెచ్ సి బి. సుందర్ రావు ఏ ఆర్ ఎస్ ఐ ఆర్.వెంకటేశ్వర్లు, హోంగార్డ్ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఆర్ ఐ లు కామరాజు, సురేష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు హేమనాధ్, హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షులు బంక శ్రీను,జాతీయ ఉపాధ్యక్షులు ఇ . వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 15 మంది పోలీస్ అధికారులకు ప్రతిభ పురస్కారాలు

- **పతకాలు సాధించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం 2026 జూన్ 2 పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను పలువురు పోలీస్ సిబ్బందికి పతకాలు లభించాయి. ఉత్తమ సేవ పతకాలు సాధించిన ముగ్గురిలో అడిషనల్ డీసీపీ బి.రామానుజం, హెడ్ కానిస్టేబుళ్లు వి.బిక్షపతి, కె సూర్యప్రకాష్ రెడ్డి వున్నారు. సేవ పతకాలు సాధించిన 12 మందికి సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా 15 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు. ఉత్తమ సేవ పతకం అడిషనల్ డీసీపీ బి.రామానుజం, వి.బిక్షపతి ఏ ఆర్ హెచ్ సి,కె సూర్యప్రకాష్ రెడ్డి హెచ్ సి,సేవ పతకం సాధించిన పోలీస్ అధికారులు కె.నాగేంద్రరావు ఎస్ఐ ఎన్.రామిరెడ్డి ఏఎస్ఐ, బి. సుందర్ రావు ఏఎస్ఐ, ఎండీ .హాలీమ్ ఏ ఆర్ ఎస్ ఐ,జి.భాస్కర్ రావు ఏ ఆర్ ఎస్ ఐ,ఎం.వెంకటేశ్వర్లు హెచ్ సి,టి.హరిచరణ్ సింగ్ హెచ్ సి,ఎస్.కె .మదార్ సాహెబ్ హెచ్ సి,ఐ.ప్రభాకరరావు హెచ్ సి,సిహెచ్ .రామారావు హెచ్ సి, జె.కృష్ణ పీసీ,డి.సుశీల్ కుమార్ పీసీ పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ అప్రజాస్వామికం

- **బీజేపీ తీరుకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్ నుండి జెడ్ పి సెంటర్ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ**
- **డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి**



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి లు ఒక ప్రకటనలో తెలిపారు.హల్ద్వానీలో కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున్ ఖర్గే ర్యాలీ వేదిక వద్ద బీజేపీ–ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్పడిన కులతత్వ శుద్ధీకరణ ఆచారాన్ని ఖండిస్తూ, దోషులపై చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేయడం ప్రజాస్వామ్యబద్ధమైనదన్నారు.అయితే దోషులపై చర్యలు తీసుకోకుండా, బీజేపీ ప్రభుత్వ ఒత్తిడితో ఉత్తరాఖండ్ పోలీసులు రాహుల్ గాంధీ పైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సిగ్గుచేటని విమర్శించారు.రాజ్యాంగ విలువలను అవమానించిన వారిని రక్షించేందుకు బీజేపీ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆయుధంగా వాడుకుంటోందని,కుల వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడేవారిని అణచివేయాలని చూస్తోందని మండిపడ్డారు.ఏఐసీసీ ఆదేశానుసారం టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు నేడు ఉదయం 10.30 నిమిషాలకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి జెడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో పీసీసీ సభ్యులు,జిల్లా ,నగర అనుబంధ సంఘాల అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని బీజేపీ కక్షపూరిత రాజకీయాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. భారత జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వ వేధింపులకు భయపడదని,సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.అదేవిధంగా బ్లాక్,మండల,పట్టణ అధ్యక్షులు మండల,పట్టణ కేంద్రాలలో నిరసన ర్యాలీ లు నిర్వహించాలని పత్రికా ముఖంగా కోరిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆటల పోటీలు

- **ప్రారంభించిన సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య**



**బోనకల్, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):** మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం మండల స్థాయి ఆటల పోటీలను సోమవారం మండలంలోని ముష్టికుంట్ల ప్రాథమిక పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలలో మండల పరిధిలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలను మండల విద్యాశాఖ అధికారి దామల పుల్లయ్య, గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాల పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పోటీతత్వ స్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. పోటీల నిర్వహణ ముష్టికుంట్ల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ నవీద్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం,ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఐ ఈ ఆర్ పి రేగళ్ల పుల్లారాణి, స్పెషల్ ఎడ్యుకేటర్ కె. ప్రశాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సునీతకుమారి, ఫిజియోథెరపిస్ట్ అమృత వర్షిణి, కేర్ టేకర్ పద్మ,ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కోతుల బెడద నివారించాలి.. ప్రభుత్వ భూములు కాపాడాలి..

- **రెండు సమస్యల పరిష్కారానికి వినతిపత్రం**



**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, ఆగస్టు 31:** కాకరవాయి గ్రామంలో కోతుల బెడద నివారణ, ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు రెండు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. కోతుల బెడద కారణంగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, కోతులను పట్టుకుని అడవుల్లో వదిలి రైతులకు రక్షణ కల్పించాలని కోరారు. అలాగే ఐలమ్మ సెంటర్, సర్దార్ పాపయ్యగౌడ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు గతంలో నోటీసులు జారీ చేసిన కబ్జాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దంతాల బాలరాజు, మండల కాంగ్రెస్ నాయకులు కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, బీఎస్పీ నాయకులు నల్లగట్టు శంకర్ మహరాజ్, రమేష్‌యాదవ్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ గ్రామ కమిటీ సభ్యులు కొత్తపల్లి శివయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొలిశెట్టి వేణు, పెనుగొండ ఉప్పలయ్య, టీడీపీ నాయకులు దేశోజు పూర్ణాచారి, సీపీఎం మండల నాయకులు కొత్తపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మధిర కోర్టులో మెగా లోక్ అదాలత్ విజయవంతానికి సన్నాహక సమావేశం

**మధిర ప్రజాజ్యోతి** 2026 సెప్టెంబర్ 12వ తేదీన మధిర కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి మధిర కోర్టు న్యాయమూర్తి శ్రీమతి దీప్తి వేముల ఆధ్వర్యంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేలా తీసుకోవాల్సిన చర్యలు, పెండింగ్‌లో ఉన్న కేసుల్లో రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించడం, ఇరుపక్షాల సమ్మతితో వివాదాలను సత్వరమే పరిష్కరించే విధానంపై చర్చించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన, సులభంగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునే అవకాశం ఉందని న్యాయమూర్తి శ్రీమతి దీప్తి వేముల గారు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.



మెగా లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, క్రిమినల్ కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ క్లెయిమ్ కేసులు తదితర రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైరా ఏసీపీ ఎస్ సారంగపాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చావలి రామరాజు,వాసంశెట్టి కోటేశ్వరావు, జ్ఞానేష్, ఏపీపీ జన్ను భద్రయ్య,మాధురి తదితరులు , కోర్టు సిబ్బంది మరియు అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు అధికారులు పాల్గొని మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు తమ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలు మరియు కక్షిదారులు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకొని తమ పెండింగ్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణికి స్పందన కరువు..

## 12 గంటలైనా రాని ఫిర్యాదులు

- ప్రజావాణికి గత సోమవారం కేవలం ఒక్క ధరఖాస్తు
- ఈ వారం దరఖాస్తు ఒక్కటే..




**రఘునాధపాలెం, ప్రజాజ్యోతి** ప్రజాపాలన గ్రామస్థాయిలోని ప్రజలకు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వ మండల స్థాయి చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి మండలంలో స్పందన కరువైంది. రఘునాధపాలెం మండలం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతీ సోమ వారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించిన స్థాయి లో స్పందన కనిపించడం లేదు. మూడవ సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కొన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరుకాగా, కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే అందింది. పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటల నుం చి మధ్యాహ్నం 1 గంటల వరకు వివిధ విభాగాల అధికారులు అంటుబాటులో ఉండగా వివిధ శాఖలకు చెందిన ఎస్ఐఆర్ కార్యక్రమం భాగంగా గ్రామాలలో హాజరుకాగా ప్రజావాణిలో మరి కొందరు కింది స్థాయి అధికారులు హాజరు కాగా ప్రజలు మాత్రం 12 గంటలైనా దరఖాస్తులు చేసుకోకపోవడంతో అధికారులు పరిచయ కార్యక్రమం పూర్తి చేసుకుని ఫిర్యాదుదారుల దరఖాస్తుల కోసం వేచి చూశారు 12.30 తర్వాత వేచి చూసిన వివిధ శాఖల అధికారులు.బూడిదంపాడు గ్రామానికి చెందిన ఒక్క ఫిర్యాదుదారులు దరఖాస్తు చేయగా ఆయా శాఖలకు ఆన్ లైన్ చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులను పరిశీలించి వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఎంపీడీఓ అశోకుమార్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించి ప్రజావాణి కార్యక్రమంలో కేవలం ఒక్కటి అంటే ఒకటి మాత్రమే ఫిర్యాదు వస్తుంది.. అంతకుమించి ఫిర్యాదులు రావడం లేదంటూ అధికారులు బోసిపోయి కూర్చుంటున్న పరిస్థితి నెలకొన్నది. ప్రజల సమస్య లను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మండల స్థాయి ప్రజావాణికి గత సోమవారం కేవలం ఒక్క ధరఖాస్తులు రాగా, ఈసారి కేవలం ఒక్కటి అంటే ఒకటి మాత్రమే దరఖాస్తు మాత్రమే రావడం గమనార్హం. 22 శాఖలకు చెందిన అధికారు లు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజల నుంచి స్పం దన లేకపోవడంతో కార్యక్రమంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రా యపడుతున్నారు.

## దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

- కూసుమంచి ఎంఈవో రాయల వీరస్వామి
- ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం



**పాలేరు ఆర్.సీ ఆగస్టు31 ప్రజాజ్యోతి** దివ్యాంగులను సమాజంలోని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని అన్నారు. వారిలో అపారమైన ప్రతిభ, సామర్థ్యం దాగి ఉందని, వారికి సరైన అవకాశాలు మరియు ప్రోత్సాహం అందిస్తే వివిధ రంగాల్లో విశేష విజయాలు సాధించగలరని కూసుమంచి ఎంఈవో రాయల వీరస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులలో అపారమైన ప్రతిభ, సామర్థ్యం దాగి ఉందని, వారికి సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తే వివిధ రంగాల్లో విశేష విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. ఆటలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని, పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రభుత్వం, విద్యా సంస్థలు, తల్లిదండ్రులు సమిష్టిగా దివ్యాంగులకు అవసరమైన సహకారం అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. దివ్యాంగులు కూడా తమ ప్రతిభను నిరూపించుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఐఈఆర్పి కళ్యాణి, ఫిజియోథెరపిస్ట్ నాగలక్ష్మి, స్పెషల్ ఎడ్యుకేటర్స్ రాజ్యలక్ష్మి, అనిత, కేర్ గివర్ పుష్పలత, సీఆర్పీలు, ఎమ్మార్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా జైలు, బాలల సదన్ ను సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికారి పి దేవి మానస






**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. దేవి మానస నెలవారీ తనిఖీలలో భాగంగా జిల్లా జైలుతో పాటు బాలల సదన్‌ను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఖైదీలు,బాలలకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, ఇతర అవసరాలను పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.అర్హులైన ఏ ఒక్కరూ ఉచిత న్యాయ సహాయం, న్యాయపరమైన సలహాలు, అవసరమైన సహాయానికి దూరం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.న్యాయ సహాయం అవసరమైన వారిని గుర్తించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని, వారికి సకాలంలో అవసరమైన న్యాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నేత్రదానం చేయండి – మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపండి

- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు 41వ నేత్ర దాన పక్షోత్సవాలు
- మరణించిన 6 నుంచి 8 గంటల్లోపు నేత్రదానం చేయాలి
- ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు లభించే అవకాశం
- కళ్లద్దాలు వాడే వారు,మధుమేహం, బీపీ, ఆస్తమా ఉన్న వారు కూడా నేత్రదానం చేయవచ్చు
- ఐడీఓసీలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన నేత్రదాన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు డాక్టర్ పి. శ్రీజతో పాటు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేత్రదాన ప్రాధాన్యత, అర్హతలు, నేత్రదానం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ఖమ్మం నేత్రనిధి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ 41వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేత్రదాన అవగాహన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని
పిలుపునిచ్చారు.నేత్రదానం చేయండి – మరోకరి జీవితంలో వెలుగులు నింపండి అనే సందేశంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.నేత్రదానం ఎవరైనా చేయవచ్చని తెలిపారు. కళ్లద్దాలు వాడే వారు, మ ధుమేహ ం, బీపీ, ఆ స్తమా వంటి వ్యాధులతో బాధపడేవారు, కంటిశుక్లాల ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా నేత్రదానం చేయవచ్చని పేర్కొన్నారు. కామెర్లు, ఎయిడ్స్, బ్లడ్ క్యాన్సర్ కారణంగా మరణించిన వారు నేత్రదానానికి అనర్హులని, ఇతర కారణాలతో మరణించిన వారు ఏ వయస్సులోనైనా నేత్రదానం చేయవచ్చని తెలిపారు.ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు లభించే అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. నేత్రదానం వల్ల మృతదేహం ముఖాకృతిలో ఎలాంటి మార్పు ఉండదని, కంటి పై పొర అయిన కార్నియాను మాత్రమే సేకరిస్తారని చెప్పారు. నేత్రదానం చేసిన వ్యక్తి మరణించిన అనంతరం కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, నేత్రదానం ఒక మహత్తర సేవగా గుర్తించాలని కోరారు.మరణించిన వ్యక్తి నుంచి ★6 నుంచి 8 గంటల్లోపు నేత్రాలను సేకరించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. మరణించిన వెంటనే కళ్లను మూసి వాటిపై తడి గుడ్డ లేదా ఐస్ ముక్క ఉంచాలని, తల క్రింద రెండు దిండ్లు ఎత్తుగా ఉంచాలని, ఫ్యాన్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. మరణం సంభవించిన వెంటనే ఖమ్మం నేత్రనిధికి సమాచారం అందించడం ద్వారా సకాలంలో నేత్రదానం చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.తమ చుట్టుపక్కల ఎవరైనా మరణించి నప్పుడు కుటుంబ సభ్యులను నేత్రదానానికి ప్రోత్సహించి ఖమ్మం నేత్రనిధికి సమాచారం అందించాలని సూచించారు.సర్వేంద్రియానాం నయనం ప్రధానం నేత్ర దానం శ్రేష్ఠదానం అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.నేత్రదానం చేసిన వారి భౌతికకాయాన్ని ఖమ్మం పట్టణంలోని ఆసుపత్రుల నుంచి వారి స్వస్థలానికి తరలించేందుకు ఖమ్మం నేత్రనిధి ఆధ్వర్యంలో ఉచిత వ్యాన్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. అంతిమ యాత్ర సమయంలో వైకుంఠధామం వరకు కూడా ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.నేత్రదానం చేయదలచిన వారు లేదా నేత్రదానానికి సంబంధించిన వివరాల కోసం ఖమ్మం ఐ బ్యాంక్ సెల్ నంబర్లు 9397191919, 9247571995 నందు సంప్రదించాలని అదనపు కలెక్టర్ సూచించారు.నేత్రదానంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు,ప్రజలకు అవగాహన కల్పిస్తూ నేత్రదాన ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, డిబిసిఎస్ డాక్టర్ బి. వెంకట నర్సయ్య,ఆప్తాలమిక్ సిబ్బంది ప్రవీణ్,నరేష్, కౌన్సిలర్ హరిప్రసాద్,జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.